
ఎర్రగడ్డలోని శ్రీ మహంకాళి సాయి శివ హనుమాన్ ఆలయం


ఆలయంలో విద్యుత్ దీపాలు

నేడు ఎర్రగడ్డలో బోనాలు

వంద ఏళ్లుగా గురువారమే వేడుకలు

ఎర్రగడ్డ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని శ్రీ మహంకాళి సాయి శివ హనుమాన్ నాలుగు గుళ్ల ఆలయంలో బోనాల ఉత్సవాలను ఆషాఢ మాసం చివరి గురువారం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. వంద సంవత్సరాలుగా గురువారమే బోనాలు, తొట్టెల ఊరేగింపు నిర్వహిస్తున్నారు. నేడు జరిగే ఉత్సవాలకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎర్రగడ్డలోని ఆనందనగర్, ప్రేమ్‌నగర్, న్యూ ప్రేమ్‌నగర్, ఎర్రగడ్డ బంజారానగర్ ప్రజలు గురువారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు.

మేల్కొలుపు సేవతో..

తెల్లవారుజాము నుంచే మేల్కొలుపు సేవతో అమ్మవారి బోనాల జాతర ప్రారంభమవుతుంది. నైవేద్యాలు, బోనాలతో మహిళలు అమ్మవారి ఆలయానికి చేరుకుంటారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు.

తొట్టెల ఊరేగింపు, పోతరాజుల విన్యాసాలు

బోనాల పండుగ అంటేనే పోతరాజులు గుర్తుకు వస్తారు. వీధుల్లో పరిగెడుతూ డప్పు వాయిద్యాలకు అనుగుణంగా నృత్యాలు, విన్యాసాలు చేస్తూ అందరినీ ఆకర్షిస్తుంటారు. రాత్రి నిర్వహించే తొట్టెల ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది.

వంద సంవత్సరాలుగా ఆనవాయితీ..

సుమారు వంద సంవత్సరాల కిందట ప్రస్తుతం ఆలయం ఉన్న స్థలంలో చిన్నవాగు ఉండేది. అక్కడ అమ్మవారు కొలువై ఉండడంతో ఆలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్నారు. తొలిసారి గురువారం బోనాల ఉత్సవాలను నిర్వహించారు. అప్పటి నుంచి అదే ఆనవాయితీ కొనసాగిస్తున్నారు. పాలు అసోసియేషన్ సభ్యులు ఫలహారం బండ్ల ఊరేగింపును ఘనంగా నిర్వహిస్తారు. హోం కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎస్ఎస్‌కే రాజు ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. బిజిలి మహంకాళి యూత్ అసోసియేషన్, మురళీధర్ భక్తసమాజము మండలి తదితర అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రస్తుతం దేవాలయ కమిటీ చైర్మన్‌గా నారాయణస్వామి, సలహాదారుగా కె.ఆనంద్ యాదవ్, కోశాధికారిగా శ్రీనివాస్ గుప్తా, సభ్యులుగా గణేశ్ యాదవ్, కె. విజయ్ యాదవ్, విజయ్ కుమార్‌గౌడ్, వెంకటేశ్, మహేందర్, అశోక్, మహేష్ యాదవ్ కొనసాగుతున్నారు.


ఊరేగింపునకు సిద్ధమైన ఫలహారం బండి

కళింగ కల్చరల్‌హాల్లో జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన


ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న రమ్యరావు

బంజారాహిల్స్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12 లోని కళింగ కల్చరల్‌హాల్లో ఏర్పాటైన జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శనను టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ రమ్యరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో పట్టు, హ్యాండ్‌లూమ్ వస్త్రోత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. ఈ ఉత్పత్తులకు నేటికీ వన్నె తగ్గలేదని, నేటి తరం యువత కూడా హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారని అన్నారు. నిర్వాహకులు జయేష్‌గుప్తా మాట్లాడుతూ ఈనెల 21వ తేదీ వరకు కొనసాగనున్న ప్రదర్శనలో దేశంలోని 14 రాష్ట్రాల నుంచి చేనేతకారులు, చేతిపని బృందాలు తమ సిల్క్ హ్యాండ్‌లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 75 వేల రకాల వస్త్రోత్పత్తులను అందుబాటులో ఉంచినట్టు చెప్పారు.

పేద విద్యార్థుల స్కూల్ ఫీజు చెల్లింపు


ఫీజు చెల్లిస్తున్న హబీబా సుల్తానా

బోరబండ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తండ్రిలేని నిరుపేద విద్యార్థులకు బోరబండ కార్పొరేటర్ సతీమణి, మహిళా కాంగ్రెస్ నాయకురాలు హబీబా సుల్తానా ఆర్థిక సహకారం చేశారు. శ్రీ సరస్వతి హైస్కూల్ విద్యార్థులు అఫాన్ అహ్మద్, రేహాన్ అహ్మద్ ఫీజు రూ.25 వేలను బుధవారం ఆమె అందజేశారు. విద్యతోనే విద్యార్థుల భవిష్యత్తు మెరుగవుతుందని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.

ఆలయాల వద్ద సదుపాయాలు కల్పించండి


జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ వెంకటేష్

బంజారాహిల్స్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బోనాల సందర్భంగా ఆలయాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతికి కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ బుధవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిలింనగర్ అమ్మవారి ఆలయాలకు వెళ్లే దారుల్లో వీధి దీపాలు వెలగడం లేదని, పలుచోట్ల తాగునీరు, ఇతర వసతులు లేవని ఆరోపించారు.



బోనాల వేడుకలకు ఆహ్వానం

బోరబండ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బోరబండ బస్టాప్ వద్ద ఉన్న శ్రీ పోచమ్మ ఆలయంలో అత్యంత వైభవంగా జరిగే బోనాల వేడుకలకు రావాలని శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌ను బోరబండ కార్పొరేటర్ ఎం.డి.బాబాఫసియుద్దీన్ కోరారు. ఆలయ కమిటీ ప్రతినిధులతో కలిసి స్పీకర్‌కు ఆయన బుధవారం ఆహ్వానం అందజేశారు. అలాగే రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్‌కు కూడ బోనాలకు ఆహ్వానం అందజేశారు.


ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు బోనాల వేడుక ఆహ్వానం అందజేస్తున్న ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగరావు

- బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి

బీజేపీ నేతకు పరామర్శ


శ్రీధర్‌ను పరామర్శించిన రామచందర్‌రావు

నిమ్స్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పోలీసుల దాడిలో గాయపడి నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్‌ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు బుధవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల ఖమ్మంలో జరిగిన నిరసన ప్రదర్శనలో కొండేటి శ్రీధర్ గాయపడిన విషయం విదితమే. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ పోలీసులు బీజేపీ కార్యకర్తల విషయంలో అత్యుత్సాహం ప్రదర్శించారన్నారు. ఈ వ్యవహారంపై మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు పులిరాం, తదితరులు పాల్గొన్నారు.


కేబీఆర్ పార్కు వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీ

కేబీఆర్ పార్కు వాకర్స్ అసోసియేషన్ ఎన్నిక

బంజారాహిల్స్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్.సచితానందరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం బంజారాహిల్స్‌లోని జింఖానా క్లబ్‌లో నూతన కమిటీ సభ్యులతో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఉపాధ్యక్షులుగా బీబీనగర్ సురేంద్రమోహన్, మారగంటి రాజేందర్‌రెడ్డి, కార్యదర్శిగా విజయమనోహర్‌రావు, సంయుక్త కార్యదర్శిగా చొక్కా సంజీవయ్య, కోశాధికారిగా జె.బాలరాజు, పలువురు ఈసీ కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా సచితానంద్ రెడ్డి మాట్లాడుతూ రెండు సంవత్సరాలపాటు ఈ కమిటీ కొనసాగుతుందని వాకర్ల సమస్యలపై అధికారులతో ఎప్పటికప్పుడు చర్చిస్తూ పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.



ఉచిత వైద్య శిబిరంలో వైద్యులు

పోషకాహారంతో రక్తహీనతను అధిగమించవచ్చు

బేగంపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మహిళలు అధిక పోషక విలువలు గల ఆహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను అధిగమించవచ్చని బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.పద్మావతి అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం జనహిత సేవా ట్రస్టు, భారత్ వికాస్ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో హిమోగ్లోబిన్, రక్త పరీక్షలను కళాశాలలో నిర్వహించారు. 500 మంది విద్యార్థినులకు పరీక్షలు చేశారు. రక్తహీనత లక్షణాల ఉన్న వారికి పోషకారాల నియమాలపై అవగాహన కల్పించారు. ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలను అందజేశారు. కార్యక్రమంలో భారత వికాస్ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.శివరామకృష్ణ, ఎన్.సదాశివరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మృదుల, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ వెంకటేశ్వర్లు, ప్రసన్న పాల్గొన్నారు.

నేడు నిమ్స్ మేలో వర్క్‌షాప్

బోరబండ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): యూసుఫ్‌గూడలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నిమ్స్ మేలో 'తెలంగాణలో సస్టైనబుల్ పామాయిల్‌పై భాగస్వామ్య సంభాషణ' అంశంపై గురువారం వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. సంస్థకు చెందిన సెంటర్ ఫర్ రెస్పాన్సిబుల్ బిజినెస్(సీఆర్‌బీ), రౌండ్‌టేబుల్ ఆన్ సస్టైనబుల్ పామ్ ఆయిల్(ఆర్ఎస్ పీఓ) సంయుక్త ఆధ్వర్యంలో ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ శాఖలు, ప్రైవేట్ రంగం, వ్యవసాయ నిపుణులు, పౌర సమాజ సంస్థలు, పరిశోధన సంస్థలు, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ల భాగస్వాములను ఒకచోట చేర్చడం ద్వారా తెలంగాణలో పామాయిల్ రంగంలో జరుగుతున్న ప్రగతి, అవకాశాలు, సవాళ్లు, సస్టైనబుల్ అభివృద్ధికి మార్గాలను చర్చించడమే ఈ వర్క్‌షాప్ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

అవకాశం ఇస్తే జూబ్లీహిల్స్ నుంచి పోటీకి సిద్ధం

- సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి


రేవంత్‌రెడ్డిని కలిసిన సీఎన్ రెడ్డి

బంజారాహిల్స్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అవకాశం ఇస్తే జూబ్లీహిల్స్ నుంచి పోటీకి సిద్ధమని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం జూబ్లీహిల్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి తనకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సీఎన్‌రెడ్డి మాట్లాడుతూ కరోనా సమయంలో అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహించినట్టు చెప్పారు. కార్పొరేటర్‌గా గెలిచిన అనంతరం ప్రతీ నిత్యం ప్రజల్లో ఉంటూ వారి ప్రతీ అవసరాన్ని తీర్చేందుకు తన వంతు కృషి చేసినట్టు వెల్లడించారు. విద్యావంతుడిగా ఇటు క్లాస్ అటూ మాస్ ప్రజలను ఆకట్టుకునే శక్తి ఉండడంతో పాటు నియోజకవర్గంలో సమస్యలు వాటి పరిష్కారంపై పూర్తి అవగాహన ఉన్నట్టు చెప్పారు. రహ్మత్‌నగర్‌లో గెలిచినప్పటికీ ప్రభుత్వ మద్దతులో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. క్రికెట్ గ్రౌండ్‌లో సకల సదుపాయాలు కల్పించడంతోపాటు మల్టీపర్పస్ కమ్యూనిటీహాల్, షాదీఖానా నిర్మాణంలో కీలకంగా వ్యవహరించినట్టు గుర్తు చేశారు. డివిజన్‌ను మోడల్ తీర్చిదిద్దేందుకు ప్రణాళికా బద్ధంగా వ్యవహరించినట్టు చెప్పారు. ప్రజలు కూడా తాను ఎక్కడకు వెళ్లినా ఆదరిస్తున్నారని కాంగ్రెస్ నుంచి టికెట్టు వస్తే తన సత్తా చాటుతానని వెల్లడించారు. టికెట్ విషయంలో అధిష్ఠానం ఎటువంటి నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉండటంతో పాటు పార్టీ విజయానికి కృషి చేస్తానని తెలిపారు.

రహ్మత్‌నగర్ సమస్యలు పరిష్కరించాలి

బోరబండ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని జీహెచ్ఎంసీ సర్కిల్-19 ఉప కమిషనర్ రజనీకాంత్‌రెడ్డిని కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి కోరారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు రోజూ బస్తీబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఉప కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఇందులో భాగంగా డివిజన్ పరిధిలోని రహ్మత్‌నగర్ జంక్షన్, కార్మికనగర్, బ్రహ్మశంకర్‌నగర్ కమ్యూనిటీహాల్, ఎస్పీఆర్ హిల్స్ క్రీడాప్రాంగణం, దళిత అధ్యయన కేంద్రం, టి.అంజయ్య నగర్ కమ్యూనిటీ హాల్, రాజీవ్‌గాంధీ నగర్, హెచ్.ఎఫ్.నగర్ ఫేజ్-2 బహుళ ప్రయోజనాల ఫంక్షన్ హాల్, శ్రీరామ్‌నగర్ బస్తీలలో అధికారులతో కలిసి పర్యటించారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ప్రసీద, ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటకిషన్‌రావు, డీఈఈ భానుచందర్, అధికారులు, డివిజన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

27న పీజేఆర్ గ్రౌండ్స్‌లో మాగంటి సంతాపసభ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, చిత్రంలో మాగంటి సతీమణి సునీత

బంజారాహిల్స్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27న బోరబండలోని పీజేఆర్ గ్రౌండ్స్‌లో దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సంతాపసభ నిర్వహిస్తున్నట్టు కుతుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తెలిపారు. నవోదయకాలనీలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాగంటి సతీమణి సునీతతో కలిసి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా మాగంటి గోపీనాథ్ ప్రజలకు ఎంతో చేరువయ్యారన్నారు. ఆయన లేని లోటు ఇటు జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలకు, అటు పార్టీకి పూడ్చలేనిదని తెలిపారు. సంతాపసభకు బీఆర్ఎస్ కార్యకర్తలు, మాగంటి అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఉప ఎన్నికలో బీఆర్ఎస్ బలం తగ్గలేదు అని నిరూపించేలా బలాన్ని ప్రదర్శించాలని సూచించారు. కుత్బుల్లాపూర్‌లో వచ్చిన మెజారిటీ ఈ సారి జూబ్లీహిల్స్‌లో కూడా వచ్చేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టిజన్ల సమస్యలపై మాట్లాడాలని కేటీఆర్‌కు వినతి


కేటీఆర్‌కు వినతిపత్రం ఇస్తున్న తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు

బంజారాహిల్స్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో పని చేస్తున్న ఆర్టిజన్లను పర్మినెంట్ చేసే అంశంపై అసెంబ్లీలో మాట్లాడాలని విద్యుత్ శాఖ ఆర్టిజన్లు తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులతో కలిసి మాజీ మంత్రి కేటీఆర్‌కు వినతి పత్రం అందజేశారు. బుధవారం బంజారాహిల్స్‌లో యూనియన్ అధ్యక్షుడు కరణం ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో ఉద్యోగులు కేటీఆర్‌ను కలిసి తమ సమస్యలపై అసెంబ్లీతో పాటు ప్రజా వేదికలపై మాట్లాడి న్యాయం చేయాలని కోరారు. యూనియన్ నేతలు మాట్లాడుతూ అటెండర్లు, రికార్డ్ అసిస్టెంట్లకు, స్క్రీనింగ్ టెస్ట్ పెట్టి ప్రమోషన్ ఇవ్వాలనే నిబంధన వల్ల వందలాది మంది ఉద్యోగులు 20 ఏళ్లుగా ఒకే పొజిషన్‌లో ఎటువంటి ప్రమోషన్ లేకుండా ఉన్నారని ఆరోపించారు. మీటర్ రీడర్స్, స్వీపర్లు, బిల్ కలెక్టర్లు, సెక్యూరిటీ గార్డులను రెగ్యులర్ చేసేలా ప్రభుత్వం ఒత్తిడి తేవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కీర్తి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సురేష్ రాజు, ఉపాధ్యక్షురాలు స్వాతి, వసంత, లింగం, అనూష పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పంజాగుట్ట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భవన, ఇతర నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని జాతీయ మానవ హక్కుల కమిటీ ఎన్జీఓ సంస్థ ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర సచివాలయంలో కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ రాష్ట్ర కమిటీ సభ్యులు ద్యాగటి హరీష్, బత్తుల రాజశేఖర్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించి వారికి అన్ని ప్రభుత్వ పథకాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ కమిటీ సభ్యుడు గణేశ్, పలు సంఘాల నాయకులు ఎలారెడ్డి, రాజు, శ్రీధర్, స్వామి, మొగులయ్య, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రియుడి వేధింపులు తట్టుకోలేక యువతి ఆత్మహత్య

బంజారాహిల్స్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రియుడి వేధింపులు భరించలేక యువతి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకృష్ణానగర్‌లో నివసించే రేణుక మాదాపూర్‌లోని ఓ సంస్థలో పనిచేస్తుంది. రెండు సంవత్సరాల క్రితం చల్లా వినయ్ కుమార్‌తో పరిచయం ఏర్పడింది. అది కాస్త ప్రేమగా మారి సహజీవనం చేశారు. కాగా, వినయ్‌కి మత్తు పదార్థాల అలవాటు ఉన్నట్టు తెలుసుకున్న రేణుక అతడి నుంచి దూరంగా ఉంటుంది. ఈనెల 9వ తేదీన రేణుక స్కూటీపై వెళ్తుండగా వినయ్ అడ్డగించాడు. బలవంతంగా వాహనం ఎక్కి జూబ్లీహిల్స్ వైపు తీసుకెళ్లాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేయగా వినయ్ మద్యం తాగినట్లు నిర్ధారణ అయింది. దీంతో స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. అప్పటి నుంచి ముభావంగా ఉంటున్న రేణుక ఈనెల 15న తల్లి బయటికి వెళ్లిన సమయంలో తన గదిలో ఉరేసుకుంది. కొంతసేపటి తర్వాత తిరిగి వచ్చిన తల్లి స్థానికుల సహాయంతో కుమార్తెను కిందికి దించి చూడగా, అప్పటికే మృతిచెందింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాలికను మోసం చేసిన యువకుడిపై పోక్సో కేసు

అమీర్‌పేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రేమిస్తున్నానని వెంటపడి, ఓ బాలికను మోసం చేసి పలుమార్లు బలవంతంగా లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేట ప్రాంతానికి చెందిన బాలిక(16)కు ఇటీవల ముఖం, కాళ్లు, చేతులకు వాపు రావడంతో కుటుంబసభ్యులు దగ్గరలోని ఓ డయాగ్నస్టిక్ కేంద్రానికి తీసుకుపోయి పరీక్షలు చేయించారు. పరీక్షలు చేసిన సిబ్బంది బాలిక ఆరు నెలల గర్భవతి అని తేల్చారు. దీంతో కుటుంబ సభ్యులు బాలికను ప్రశ్నించడంతో తమ గ్రామంలోని ఓ యువకుడు తనను బలవంతంగా మోసం చేశాడని చెప్పింది. గత అక్టోబరులో వరంగల్‌లోని స్వస్థలానికి వెళ్లిన సమయంలో ప్రశాంత్(20) ప్రేమిస్తున్నానంటూ బాలిక వెంటపడ్డాడు. ఈ సంవత్సరం జనవరిలో మరోసారి గ్రామానికి వెళ్లినప్పుడు ఇంట్లో బాలిక ఒంటరిగా ఉన్న సమయం చూసుకుని బలవంతంగా లైంగిక దాడి చేశాడు. ఆ తర్వాత కూడా పలుమార్లు బాలికను బలవంతం చేశాడు. బాలిక పెళ్లి ప్రస్తావన తీసుకువచ్చేసరికి నాలుగు నెలలుగా ఫోన్ లిఫ్ట్ చేయకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రశాంత్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

డబ్బు, ఆభరణాలు పోయాయని

సోదా చేసినట్టు నటించి చోరీ

బంజారాహిల్స్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): డబ్బులు, బంగారు నగలు పోయాయంటూ ఓ ఇంట్లోకి అక్రమంగా దూరిన యువకుడు అల్మారలో ఉన్న వస్తువులను చోరీ చేసి పారిపోయాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిలింనగర్ బీజేఆర్ నగర్‌కు చెందిన అమీనా ఫాతిమా చికెన్ పకోడా వ్యాపారం చేస్తుంది. ఆమె షాపులో గౌతమ్ అనే వ్యక్తి కొద్ది రోజులు పనిచేసి మానేశాడు. ఈనెల 15న ఫాతిమా కుమారులు స్కూల్‌కు వెళ్లి ఇంటికి తిరిగివచ్చారు. అక్కడే ఉన్న గౌతమ్ తన డబ్బు, నగలు కనిపించకుండా పోయాయని, మీ ఇంట్లోనే ఉన్నాయంటూ పిల్లలను బెదిరించి ఫాతిమా ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించాడు. కొద్దిసేపు వెతికినట్టు నటించి అల్మారాలో ఉన్న రూ. 40 వేలు, తులంన్నర బంగారు ఆభరణాలు తీసుకొని పారిపోయాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భవనం పైనుంచి పడి వ్యక్తి మృతి

- సుజాతనగర్‌లో ఓ హోటల్ టీ మాస్టర్‌గా గుర్తింపు
- మృతుడు సనత్‌నగర్‌వాసి

పెందుర్తి(విశాఖపట్నం), జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం మహానగర పరిధి పెందుర్తి సమీపంలోని సుజాతనగర్‌లోని ఓ హోటల్‌లో టీ మాస్టర్‌గా పనిచేస్తున్న వ్యక్తి అనుమానాస్పద స్థితిలో బుధవారం మృతిచెందాడు. పెందుర్తి సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ సనత్‌నగర్‌కు చెందిన శ్రీవర్ధన్‌సింగ్(58) ఉపాధి కోసం విశాఖ వచ్చాడు. ఈక్రమంలో పెందుర్తి సమీపంలోని సుజాతనగర్‌లోని ఓ కేఫ్‌లో నెల రోజుల క్రితం టీ మాస్టర్‌గా చేరాడు. అతడు మద్యం తాగి పనిలోకి రావడంతో హోటల్ యజమాని సన్యాసిరావు పనివేళల్లో ఇది సరికాదని మందలించాడు. హోటల్ నిర్వాహక సిబ్బందితో కలిసి ఓ ఫ్లాట్‌లో ఉండేవాడు. మంగళవారం వ్యాపారం లేకపోవడంతో విశ్రాంతి తీసుకుంటానని చెప్పి సిబ్బంది బసచేస్తున్న ఫ్లాట్‌కు వెళ్లాడు. అదే రోజు రాత్రి సిబ్బంది ఉంటున్న మొదటి అంతస్తు ఫ్లాట్ నుంచి ఓ వ్యక్తి కిందపడి తలకు తీవ్రగాయాలయ్యాయని వాచ్‌మన్ హోటల్ యజమాని సన్యాసిరావుకు సమాచారం అందించాడు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న యజమాని కింద పడిన వ్యక్తిని టీ మాస్టర్ శ్రీవర్ధన్‌సింగ్‌గా గుర్తించారు. వెంటనే వైద్యం కోసం 108కి ఫోన్ చేయగా సిబ్బంది వచ్చి వైద్య పరీక్ష చేసి మృతిచెందినట్లు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ సతీశ్‌కుమార్ క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. మద్యం తాగిన మత్తులో ప్రమాదవశాత్తు ఫ్లాట్ నుంచి జారిపడ్డాడా? ఇతర కారణాలు ఉన్నాయా? అన్న కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. మృతుడి వద్ద ఆధార్ కార్డు తప్ప ఇతర వివరాలు ఏవీ తెలియరాలేదని కేసు దర్యాప్తు చేస్తున్న సీఐ సతీశ్‌కుమార్ పేర్కొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడుపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన పేదలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సతన్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. బుధవారం వెస్ట్ మారేడుపల్లిలోని తన కార్యాలయంలో బాలానగర్ తహసీల్దార్ కార్యాలయం పరిధిలోని సనత్‌నగర్ డివిజన్‌కు చెందిన 12మంది లబ్ధిదారులకు షాదీ ముబారక్ 10 చెక్కులను, కల్యాణలక్ష్మి 2 చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపడుచు పెళ్లి పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థికంగా భారంతో కూడుకున్నదని, వారికి కొంత చేయూత అందించి ఆదుకోవాలనే ఆలోచనతో నాటి సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేనివిధంగా ఒక లక్ష 116 రూపాయల ఆర్థిక సహాయం అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొలన్ లక్ష్మి, మాజీ కార్పొరేటర్ శేష కుమారి, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది విజయ్ అజయ్, అజయ్, నాయకులు బాల్‌రెడ్డి, సురేష్ గౌడ్, కరీం, తదితరులు పాల్గొన్నారు.



లలితనగర్‌కాలనీలో మొక్కను నాటుతున్న కార్పొరేటర్ కంది శైలజ తదితరులు

మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

- కార్పొరేటర్ కంది శైలజ

బౌద్ధనగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదామని బౌద్ధనగర్ డివిజన్ కార్పొరేటర్ కందిశైలజ అన్నారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం లలితనగర్‌కాలనీ పార్కులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా పార్కులు, బహిరంగ ప్రదేశాలు, ఇంటిముందు మొక్కలను నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బెజ్జంకి శ్రీకాంత్, పాక సాయి, శ్రీకాంత్, కృష్ణకుమారి, భూలక్ష్మి, హార్టికల్చర్ మేనేజర్ మహేశ్వరి, సూపర్‌వైజర్ ప్రవీణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

- బోనాల పండుగ పురస్కరించుకుని బౌద్ధనగర్ డివిజన్లో పలు ప్రాంతాల్లో చేపట్టిన ప్యాచ్‌వర్క్ పనులను కార్పొరేటర్ కంది శైలజ పరిశీలించారు. ఆలయాల వద్ద, గుంతలు పడిన రోడ్ల వద్ద మరమ్మత్తులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

బంగారు మైసమ్మ ఆలయంలో పూజలు

బౌద్ధనగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ మధురానగర్‌కాలనీ బంగారు మైసమ్మ ఆలయంలో బుధవారం చిలకలగూడ డివిజన్ ఏసీపీ శశాంక్‌రెడ్డి, వారాసిగూడ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి, సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 20న జరిగే బోనాల జాతర పురస్కరించుకుని ఆలయ ఆవరణలో మరమ్మగ్గంపై అమ్మవారికి పట్టుచీర నేసే కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, ఎస్సై మల్లికార్జున్, నాయకులు జయరాజ్, శ్రీధర్, శ్రీనివాస్, కృష్ణ, ధనశేఖర్, శ్రీకాంత్‌రెడ్డి, పట్టుచీర బహూకరించే చంద్రకాంత్, లక్ష్మీ దంపతులు తదితరులు పాల్గొన్నారు.



చిలకలగూడలో అధికారులతో వాగ్వివాదానికి దిగిన ఫుట్‌పాత్ వ్యాపారులు

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపు

బౌద్ధనగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): చిలకలగూడలో ప్రధాన రోడ్లు, ఫుట్‌పాత్‌లపై అక్రమంగా ఏర్పాటుచేసిన బండ్లు, షాపులను బుధవారం ఉదయం జీహెచ్‌ఎంసీ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. ఆదివారం ఈ ప్రాంతంలో కట్టమైసమ్మ, పోచమ్మ ఆలయం వద్ద జరగనున్న బోనాల సందర్భంగా ఈ ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటుచేసిన దుకాణాలను తొలగించారు. దీంతో ఫుట్‌పాత్ వ్యాపారస్తులకు అధికారులు, పోలీసులకు వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో కొద్దిసేపు స్వల్ప ఉద్రికత్త నెలకొనగా కొన్ని దుకాణాలను తొలగించిన జీహెచ్‌ఎంసీ సిబ్బంది, పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. వ్యాపారులు యథావిధిగా ఫుట్‌పాత్‌లపై దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. టౌన్‌ప్లానింగ్ ఏసీపీ పావని, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న బీజేపీ నేతలు

అవకాశం వస్తే పోటీ చేస్తా

అడ్డగుట్ట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరుగబోయో జీహెచ్‌ఎంసీ కార్పొరేషన్ ఎన్నికల్లో అవకాశం వస్తే పోటీలో ఉంటానని బీజేవైఎం గ్రేటర్ కార్యదర్శి శివాజీ తెలిపారు. బుధవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సీనియర్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ఇరవై ఐదేళ్లుగా బీజేపీలో వివిధ పదవుల్లో పనిచేశానని, రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో కార్పొరేటర్‌గా తనకు అవకాశం వస్తే తప్పకుండా పోటీలో ఉంటానని అన్నారు. పార్టీ కోసం పనిచేస్తున్న సీనియర్ నాయకులకు టికెట్ ఎవరికి ఇచ్చినా తాను కచ్చితంగా పనిచేస్తానన్నారు. తమకు బీజేపీ పార్టీ ముఖ్యమని, అధిష్ఠానం ఎలా చెబితే అలా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యకర్తల సమావేశంలో బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి సాయన్న, హంసరాజు, ఉదయ్ యాదవ్, శివ, మహేందర్, నరేందర్, సాయిబాబా, కళావతి, శ్యామల పాల్గొన్నారు.

దివ్యాంగుడు శ్రీనివాస్‌కు డాక్టరేట్



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న పి.శ్రీనివాస్

అడ్డగుట్ట, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : వికలాంగుల సంక్షేమం కోసం నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహించిన తుకారాంగేట్‌కు చెందిన పి.శ్రీనివాస్‌కు డాక్టరేట్ దక్కింది. ఈ డాక్టరేట్‌ను వికలాంగుల సంఘం జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర్ రావు, గ్రేటర్ అధ్యక్షుడు జంగిలి శ్రీనివాస్‌లు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించడమే గాకుండా దివ్యాంగుల పక్షాన పోరాటం చేసి నిరంతరం సేవలందించిన తనకు బుక్ ఆఫ్ రికార్డు గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ద్వారా డాక్టరేట్ రావడం ఆనందంగా ఉందన్నారు.

ఘనంగా లాల్‌బజార్ మహంకాళి బోనాల జాతర



బోనం ఎత్తిన యువతి



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే శ్రీగణేష్



అమ్మవారికి బోనం సమర్పించడానికి వెళుతున్న కాంగ్రెస్ నాయకురాలు నాగేనేని సరిత



బోనం సమర్పించడానికి వెళుతున్న కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు భాగ్యశ్రీ, శ్యామ్ కుమార్

తిరుమలగిరి జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆషాడ మాసం బోనాల జాతరలో భాగంగా తిరుమలగిరి లాల్‌బజార్‌లోని మహంకాళి దేవాలయంలో బుధవారం బోనాల వేడుకలు కన్నుల పండువగా జరిగాయి.. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు నెత్తిన బోనం పెట్టుకుని పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారికి సమర్పించారు. సాకలను సమర్పించి తల్లీ మమ్మల్ని చల్లగా చూడాలంటూ మొక్కులు చెల్లించుకున్నారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ సత్యచంద్రారెడ్డి ఎమ్మెల్యేను శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. అదేవిధంగా కంటోన్మెంటు బోర్డు 7వ వార్డు మాజీ సభ్యులు ప్యారసాని భాగ్యశ్రీ, ప్యారసాని శ్యామ్‌కుమార్‌లు అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు నాగనేని సరిత కుటుంబ సమేతంగా అమ్మవారికి బోనం సమర్పించారు. కల్లు, బెల్లం నీళ్లతో తయారు చేసిన సాకను సమర్పించి చల్లగా దీవించమని అమ్మవారిని వేడుకున్నారు. తెలంగాణ ఉద్యమకారుడు సత్యనారాయణ గౌడ్ కుటుంబ సమేతంగా బోనంతో వచ్చి అమ్మవారికి బోనం సమర్పించి దీవెనలు పొందారు. డప్పుల దరువుల కోలాహలంగా బోనాలు సమర్పించి మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు పచ్చి కుండ ఎదుర్కోలు

రెండు రోజుల పాటు జరగనున్న బోనాల జాతరలో భాగంగా ముఖ్య ఘట్టం గురువారం పచ్చికుండ ఎదుర్కోలు జరుగనుంది. దేవాలయం చైర్మన్ మురళీ ముదిరాజ్, ఈఓ సత్యచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వాహకులు దేవాలయం నుంచి బయలుదేరి తిరుమలగిరి విలేజ్‌లో కుమ్మరి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు తయారు చేసిన పచ్చి కుండను ఎదుర్కొని దేవాలయానికి తీసుకుని రావడం ఆనవాయితీగా వస్తుంది. అదే పచ్చికుండపై ఏర్పుల జగదీష్ కుటుంబీకులు భవిష్యవాణి వినిపిస్తారు. గావురంగం, బలిగంప కార్యక్రమాలు కూడా జరగనున్నాయి.

రాజకీయాలకతీతంగా 'బోనాలు' జరుపుకుందాం

- ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బౌద్ధనగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): చిలకలగూడ కట్టమైసమ్మ పోచమ్మ ఆలయంలో వచ్చే ఆది, సోమవారం నిర్వహించే ఆషాడ మాస బోనాల జాతరను రాజకీయాలకతీతంగా జరుపుకుందామని సికింద్రాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు తీగుళ్ల పద్మారావు గౌడ్ అన్నారు. బుధవారం కట్టమైసమ్మ ఆలయ ఆవరణలో వివిధ ప్రభుత్వ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బోనాల ఏర్పాట్లలో అధికారులు ఆలసత్వం వహించరాదని, భక్తులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జీహెచ్‌ఎంసీ ద్వారా రోడ్లు మరమ్మతులు, పరిశుభ్రతను చేపట్టాలని, అదనపు సంఖ్యలో పోలీస్ సిబ్బందిని నియమించాలని, ఆలయంలో ప్రత్యేకంగా 30సీసీ కెమెరాలను ఏర్పాటుచేయాలని సూచించారు. ఆలయం వద్ద మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు, జనరేటర్లను అందుబాటులో ఉంచాలని, మున్సిపల్ మైదానాన్ని వాహనాల పార్కింగ్‌కు వినియోగించాలని, ప్రత్యేక వైద్యశిబిరంను ఏర్పాటు చేయాలని కోరారు. కట్టమైసమ్మ ఆలయ హక్కుదారులకు చెల్లించే గౌరవ భృతిని పెంచాలని హక్కుదారులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేయగా వారికి పదివేల రూపాయల చొప్పున చెల్లించాలని దేవాదాయశాఖ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఉపకమిషనర్ ఆంజనేయులు, ఆలయ కార్యనిర్వహణాధికారి మహేందర్‌గౌడ్, ఇన్‌స్పెక్టర్ అనుదీప్, ఆలయ చైర్మన్ గుంటి కృష్ణ, నాయకులు తీగుళ్ల రామేశ్వర్‌గౌడ్, గరిగి పోగుల చంద్రశేఖర్, బండారి మహేందర్‌ముదిరాజ్, నాగేందర్, వెంకటేష్, బాలాజీ, రాజేశ్, సాయి తదితరులు పాల్గొన్నారు. సీతాఫల్ మండి క్యాంపు కార్యాలయంలో మైలార్‌గడ్డకు చెందిన అనారోగ్యంతో సతమతమవుతున్న భగ్గు హరీష్‌కు ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ వైద్య ఖర్చుల నిమిత్తం రెండు లక్షల రూపాయల విలువచేసే ఎల్ఓసీ(లెటర్ ఆఫ్ క్రెడిట్) పత్రాన్ని అందజేశారు.



కట్టమైసమ్మ ఆలయంలో సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ తదితరులు

ఎమ్మెల్యేను కలిసిన ఉప కమిషనర్

జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ నూతన ఉప కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆంజనేయులు చిలకలగూడ కట్టమైసమ్మ, పోచమ్మ ఆలయంలో సికింద్రాబాద్ శాసనసభ్యుడు తీగుళ్ల పద్మారావు గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఆయా డివిజన్లలో నెలకొన్న సమస్యలపై వారు చర్చించారు.



మీడియా సమావేశంలో పాల్గొన్న మహాకాళి బోనాల జాతర కమిటీ సభ్యులు

ఉజ్జయినీ మహాకాళి బోనాల జాతర విజయవంతం

సికింద్రాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మకమైన సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి అమ్మవారి బోనాల జాతర అందరి సహకారంతో విజయవంతమైందని ఆలయ బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు చెప్పారు. బుధవారం ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డితో కలిసి కమిటీ సభ్యులు హేమంత్‌సింగ్ ఠాకూర్, దేవి వరప్రసాద్, శ్రీకాంత్, అశ్విన్‌గౌడ్, రాకేష్ అగర్వాల్, వేణుగోపాల్, కృష్ణముదిరాజ్‌లు మీడియా సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్, దేవాదాయ శాఖ కమిషనర్ వెంకట్రావ్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, నగర పోలీసు కమిషనర్ సి.వి.ఆనంద్ తదితర విభాగాల అధికారులు నెలరోజుల నుంచి కష్టపడి ఏర్పాట్లు చేశారని వారు చెప్పారు. అన్ని శాఖల అధికారులు, వాలంటీర్ల సమన్వయంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా బోనాల జాతర విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించారని, వారందరికీ అభినందనలు తెలుపుతున్నామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

పేద ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యం



ఎల్ఓసీ పత్రాలను అందజేస్తున్న అనిల్‌కుమార్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు మల్లిఖార్జున్

రెజిమెంటల్‌బజార్, జూలై 16(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. మోండా డివిజన్ నాలాబజార్‌కు చెందిన లావణ్య అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. వైద్య ఖర్చులు చెల్లించే ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు అనిల్ కుమార్‌ను కలువడంతో ఆయన సీఎం సహాయనిధికి సిఫార్సు చేశారు. బుధవారం రూ.5 లక్షల ఎల్ఓసీ మంజూరి పత్రాలను ఆమె కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో రాంగోపాల్‌పేట కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

సత్కారం



ఉజ్జయినీ మహాకాళి బోనాల జాతరను విజయవంతంగా నిర్వహించడంలో ప్రముఖ పాత్ర వహించిన టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ, ఏఐసీసీ మీడియా & పబ్లిసిటీ(కమ్యూనికేషన్ డిపార్ట్‌మెంట్) చైర్మన్ పవన్ కేర దంపతులను ఓల్డ్ ఘస్మండిలోని తన నివాసంలో విందు ఏర్పాటు చేసి సత్కరించిన సనత్‌నగర్ ఏ బ్లాక్ అధ్యక్షులు త్రికాల మనోజ్ కుమార్ ముదిరాజ్ దంపతులు.

- రాంగోపాల్‌పేట్, ఆంధ్రజ్యోతి

జాతీయ లీగల్ రీసెర్చ్ మెథడాలజీ వర్క్‌షాప్ ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయంలో లా ఫ్యాకల్టీ మూడు రోజుల పాటు నిర్వహించనున్న '21- గంటల జాతీయ లీగల్ రీసెర్చ్ మెథడాలజీ వర్క్‌షాప్'ను బుధవారం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లాలో ప్రారంభించారు. ఈ సమావేశానికి ఓయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చట్టపరమైన వృత్తికి పెరుగుతున్న ప్రాముఖ్యతను, క్లిష్టమైన లీగల్ పరిశోధన ఆవశ్యకతను వివరించారు. ఓయూ న్యాయ విభాగాధిపతి, డీన్ అండ్ హెడ్, వర్క్‌షాప్ కన్వీనర్ ప్రొఫెసర్ బి.విజయలక్ష్మి మాట్లాడుతూ.. న్యాయ పరిశోధన పద్ధతి ప్రాముఖ్యతను పోస్ట్ గ్రాడ్యుయేట్, పీహెచ్‌డీ విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. మూడు రోజుల ఈ వర్క్‌షాప్‌లో 9 సాంకేతిక సెషన్‌లు ఉంటాయని, ప్రతి సెషన్‌లో ప్రశ్నోత్తరాలు, అభ్యర్థుల ప్రెజెంటేషన్లు అంతేకాకుండా నిపుణుల మూల్యాంకనంపై ఒక సెషన్ ఉంటుందని పేర్కొన్నారు. ఈ వర్క్‌షాప్‌నకు రిసోర్స్ పర్సన్‌లుగా దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ రీసెర్చ్ మెథడాలజీ ప్రొఫెసర్లు ఉన్నారు. లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రామ్ ప్రసాద్ ఈ సెషన్‌కు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎస్.వెంకటేశ్వర్లు, ఎగ్జామినేషన్ అదనపు కంట్రోలర్ డాక్టర్ డి.రాధిక యాదవ్ పాల్గొన్నారు.



బోయినపల్లి సంజీవయ్య కాలనీ బోనాల జాతర ఆహ్వాన పత్రికను జంపన ప్రతాప్‌కు అందజేస్తున్న కమిటీ సభ్యులు

బోనాల ఉత్సవాల ఆహ్వాన పత్రిక

బోయినపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఆషాఢ మాస బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని బోయినపల్లి సంజీవయ్య నగర్ వీకర్స్ సెక్షన్ భైరామ్ వ్యాయామశాల చిన్నతోకట్టలోని వివిధ ఆలయాల కమిటీ సభ్యులు బుధవారం కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్‌ను కలిసి ఉత్సవాలకు రావాల్సిందిగా ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా, భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బచ్చన్ రాజు, శ్రీనివాస్, అరుణ్ యాదవ్, వరప్రసాద్, బండి శ్రీనివాస్, సాయిబాబా యాదవ్, యాదగిరి, కరణ్ సింగ్, శశిధర్ యాదవ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దళితులకు బహిరంగ క్షమాపణ చెప్పాలి : ఎమ్మార్పీఎస్



బోయినపల్లి మార్కెట్‌యార్డు వద్ద నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బోయినపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి ఇటీవల దురహంకార ధోరణితో ఎమ్మార్పీఎస్ దిమ్మెను కూల్చివేయడం జరిగిన నేపథ్యంలో ఆమెను వెంటనే బర్తరఫ్ చేయాలని, దళితులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని కంటోన్మెంట్ ఎమ్మార్పీఎస్ నాయకుడు శ్రీకిషన్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం బోయినపల్లి మార్కెట్‌లోని డా. బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు శ్రీకిషన్, అజిత్ కల్యాణ మాదిగల ఆధ్వర్యంలో నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైరతాబాద్ నియోజకవర్గం బంజారాహిల్స్ డివిజన్ ఎన్‌బీటీనగర్‌లో ఎంఆర్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు జెండాను ఏర్పాటుచేశారు. అలా కట్టిన జెండా దిమ్మెను కుల అహంకారంతో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కె.కేశవరావు కుమార్తె హైదరాబాద్ నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి తన అనుచరులతో ఇటీవల కూల్చివేయడం జరిగిందన్నారు. కులాన్ని దూషించిన మేయర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. అన్యాయంగా ఎమ్మార్పీఎస్ నాయకులపై పెట్టిన అక్రమ కేసులు తక్షణమే ఉపసంహరించుకోవాలని, కూల్చిన ఎమ్మార్పీఎస్ జెండా దిమ్మను తిరిగి అదే ప్రదేశంలో పునర్నించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆమె ఇంటిని ముట్టడిస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ నాయకులు మక్కల అశోక్, నరసింహ, మంద మధుకర్, విష్ణు, వెంకట్, ప్రవీణ్, గిరిబాబు, రమేష్, శ్రీను, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సౌమ్యశ్రీ బిషీకి న్యాయం చేయాలి

ఓయూలో ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రంలోని బాలాసోర్ జిల్లాలోని ఫకీర్ మోహన్ యూనివర్సిటీ విద్యార్థిని సౌమ్యశ్రీ బిషీకి న్యాయం చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) ఉస్మానియా యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఎన్‌సీసీ గేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ ఓయూ అధ్యక్ష, కార్యదర్శులు దృహన్, శివశంకర్ మాట్లాడుతూ.. ఒడిశాలో ఫకీర్ మోహన్ కళాశాలకు చెందిన ఒక ప్రొఫెసర్ తనను లైంగికంగా వేధిస్తున్నాడని అదే కళాశాల విద్యార్థిని, ఏబీవీపీ కార్యకర్త సౌమ్యశ్రీ బిషీ కళాశాల అంతరంగిక కమిటీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. హెచ్ఓడీతో కుమ్మక్కైన ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు సౌమ్యశ్రీ మనస్థైర్యాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించారని ఆరోపించారు. మనస్తాపానికి లోనైన సౌమ్యశ్రీ ఆత్మహత్యకు పాల్పడడంతో ఎక్కడ తమ పేరు బద్నాం అవుతుందోనని ఎన్ఎస్‌యూఐ, కాంగ్రెస్ నాయకులు మొసలి కన్నీరు కారుస్తూ నిరసన తెలపడం సిగ్గుచేటన్నారు. వెంటనే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే అమ్మాయిలపై జరిగే అఘాయిత్యాలకు అడ్డుకట్ట వేసేందుకు కళాశాలలో ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీని నియమించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ నగర కార్యదర్శి పృథ్వీతేజ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అలివేలి రాజు, యూనివర్సిటీ నాయకులు చిరంజీవి, భాస్కర్, అన్వేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



మౌన ప్రదర్శనలో పాల్గొన్న జేఏసీ ప్రతినిధులు

ఆందోళనకు దిగుతారన్న అనుమానంతో అరెస్టు చేయడం అమానుషం

సికింద్రాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సీఎం రాక సందర్భంగా ఆందోళనకు దిగుతారన్న అనుమానంతో తూముకుంట వద్ద అమాయక ప్రజలను అరెస్టు చేయడం అమానుషమని రాజీవ్ రహదారి ప్రాపర్టీ ఓనర్స్ జేఏసీ చైర్మన్ తేలుకుంట సతీష్‌గుప్తా విమర్శించారు. తూముకుంట వద్ద ప్రజలను అక్రమంగా అరెస్టు చేశారంటూ బుధవారం సికింద్రాబాద్ కార్ఖానలోని డాక్టర్ అంబేద్కర్ విగ్రహం వద్ద రాజీవ్ రహదారి ప్రాపర్టీస్ ఓనర్స్ జేఏసీ ఆధ్వర్యంలో మౌన ప్రదర్శన నిర్వహించారు. ప్రజల పట్ల ప్రేమతో ఎన్నో సంక్షేమ పథకాలు చేపడుతున్న సీఎం నిబద్ధతను తాము గౌరవిస్తున్నామని, అయితే రాజీవ్ రహదారి విస్తరణ వలన సర్వం కోల్పోతున్న వారికి న్యాయం చేయాలని, 200 అడుగులకు బదులుగా 100 అడుగుల మేరకు విస్తరణ చేపట్టాలని ఆయన కోరారు. ఆస్తినష్టం జరిగిన వారికి మార్కెట్ విలువ ప్రకారం మరో ప్రధాన ఏరియాలో భూములు ఇవ్వాలని ఆయన కోరారు. ప్రదర్శనలో జేఏసీ ప్రతినిధులు పాల్గొన్నారు.